

# రెప్పల మీద నీడలు

## – అత్తలూరి విజయలక్ష్మి



## (గత సంచిక తరువాయి)

14

**పెళ్లి పనులు యుద్ధప్రాతిపదికన** మొదలుపెట్టాడు మాధవ. సరిగ్గా 28 రోజుల్లో పెళ్లి.

ఇంట్లో ఎవరినీ ఏ విషయంలోనూ సంప్రదించకుండా కళ్యాణ వేదిక చూసి  అడ్వాన్సు ఇచ్చాడు. పురోహితుడి దగ్గరకు వెళ్లి పెళ్ళికి కావాల్సిన సామాన్లు, బట్టలు ఎవరెవరికి పెట్టాలి ఇలాంటి విషయాలు ఆయనే నిర్ణయించేసాడు. వంటవాళ్ళను కూడా మాట్లాడేసాడు.  ఏమేం వంటలు చేయాలి అన్న అంశం ప్రస్తావన కి వచ్చినపుడు మాత్రం భార్యని, తల్లిని సంప్రదించాడు. కొడుకు వాలకం నాంచారమ్మకి, భర్త పద్ధతి వర్ధనికి కూడా నచ్చలేదు. ఆయనతో వాదించినా ప్రయోజనం ఉండదని తెలుసు కాబట్టి, ఇద్దరూ మౌనం వహించారు. వాళ్లకి తోచిన పిండివంటలు, వంటల మెనూ ఇచ్చేసారు.

మరునాడు సాయంత్రం ఇంటికి వస్తూనే  వర్ధనితో చెప్పాడు. "రేపు ఉదయమే నువ్వు, నేను, పవిత్ర విజయవాడ వెళ్దాము. పెళ్లి బట్టలు కొనాలిగా". అని.

వర్ధని ఆశ్చర్యంగా అంది."అదేంటి? ఆ అబ్బాయి కూడా వస్తా అన్నాడుగా".

"అతని దారిన అతను వెళ్తాడులే." నిరాసక్తంగా అన్నాడు.

అప్పుడే పై నుంచి కిందికి దిగుతున్న పవిత్ర ఆ మాటలు విన్నది.

తండ్రి మాటలకి  కోపం వచ్చేసింది. గబుక్కున అంది "నాన్నా! శివ కూడా నాకు చీరలు కొంటాను అన్నాడు కదా! నగలు కూడా కొంటాను అన్నాడు. కలిసి వెళదాము అన్నావుగా"

ఆయన తలతిప్పి కూతురు వైపు చూసి "అక్కడికి వెళ్ళాక, మీరిద్దరూ వేరుగా షాపింగ్ చేయను అంటే అతను కూడా రావచ్చు. మాతోటే రావాలి... మాతోటే  ఉండాలి".

పవిత్ర తల్లివైపు చూసింది. ఆవిడ పనున్నట్టు మొహం తిప్పుకుని వంట గదిలోకి వెళ్ళిపోయింది.

పవిత్రకి అర్థం అయింది. పెళ్లి అయిందాకా తను అమ్మ, నాన్నల కనుసన్నల్లో ఉండాల్సిందే. ఎన్నడూ లేని ఆంక్షలు, నిబంధనలు విధించారు.  దీనికి కారణం నాన్నే. అమ్మదేం లేదు అనుకుంది.

ఎందుకు తండ్రి అకస్మాత్తుగా ఇంత కఠినంగా మారిపోయాడు ఎంత ఆలోచించినా అర్థం కాలేదు ఆమెకి. ఎంతో విశాలమైన భావాలతో ఎప్పుడూ శాంతంగా, నవ్వుతూ ఉండే నాన్న ఇలా మారడానికి కారణం తనా? మోహనా? శివనా? శివంటే ఈయనకి ఇష్టం లేదా? మరి పెళ్ళికి ఎందుకు ఒప్పుకున్నాడు? ఆయన గట్టిగా కాదు అంటే, తనేం చేయగలుగుతుంది! ఆయన చూసిన వాడితో మూడుముళ్ళు వేయించుకుని చావలేక బతుకుతుంది. అంతేగా! అలా జరుగుతుందని, తను అలా బతకడం ఆయన తట్టుకోలేడని ఊహించి ఒప్పుకున్నాడా? ఎందుకు శివ డాక్టర్. అందగాడు... మంచివాడు. ఏంటి నాన్న అభ్యంతరం?

పవిత్రకి ఎంత ఆలోచించినా తండ్రి ధోరణి అర్థం కాలేదు.

మోహన్ తన వెంట పడుతున్నాడని, తను శివతో తిరుగుతోందని తన జీవితంలో ఏదో గందరగోళం ఏర్పడుతోందని చదువు మాన్పించాడు. కానీ, ఇప్పుడు మోహన్ లేడు... శివతో పెళ్లి నిశ్చయం అయింది. అయినా కాలేజికి వెళ్ళనివ్వడం లేదు. ఇంట్లోంచి కాలు కదపనివ్వడం లేదు. ఈ నిబంధనలు నరక సదృశంగా ఉన్నా, శివతో పెళ్లి జరిగి వెళ్ళిపోతాను అన్న ఒక్క ఆశతో అన్నీ భరిస్తోంది. కానీ, ఈయన రోజు,రోజుకీ నియంతలా మారిపోతున్నాడు. ఆఖరికి తన బట్టలు తన ఇష్టానికి వదలడం లేదు. కనీసం నగలు ఏం కొంటున్నారో చెప్పలేదు. పవిత్ర అసహనంగా కదిలింది.

తల్లి దగ్గరకు వెళ్లి నెమ్మదిగా అడిగింది. “అమ్మా నాకు నగలు నాన్నే కొన్నారా? నాకు కావాల్సినవి నేను కొనుక్కోకూడదా?”

ఆవిడకి కూతురుని చూస్తుంటే జాలేసింది. తప్పు ఎవరిది అయినా, శిక్ష మాత్రం ఇది అనుభవిస్తోంది. చదువు మానిపించి చాలా తప్పు చేసాడు ఆయన. ఇంట్లో కూర్చుని, కూర్చుని చలాకీ తనం మొత్తం పోయింది. లేడిలా గంతులేసే పిల్ల... అస్తమానం తన గదిలోనే కూర్చుని ఉంటోంది. ఇదివరకులా అల్లరి, పెంకేతనం, హుషారు అన్నీ పోయాయి. ఆవిడ హృదయం ద్రవించిపోయింది.

కూతురుని దగ్గరకు తీసుకుని అంది.” నీకు చిన్నప్పటి నుంచీ కొన్న నగలే చాలా ఉన్నాయి కదమ్మా. మళ్ళీ శ్రావణ మాసంలో చేయిస్తా అన్నారు. ఎలాగా అతను కొంటా అన్నాడు కాబట్టి, అందరం కలిసి బంగారం కొట్టుకి వెళదాం. నీకు నచ్చినవి తీసుకో. అక్కడే ఇంకేదన్నా నచ్చితే చెప్పు నాన్న కొంటారు.”

పవిత్ర మాట్లాడలేదు. ఆవిడ అన్నట్టు చిన్నప్పటి నుంచీ ఏడాదికి రెండుసార్లు నగలు చేయించారు. ఒకటి పుట్టినరోజుకి, రెండోది దీపావళికి. ఎప్పుడు చేయించినా మూడు, నాలుగు జతల దిద్దులు, నెక్లెస్, గొలుసు చేయిస్తారు. దాదాపు తన దగ్గర పది నెక్లస్ లు, బోలెడు గొలుసులు, జూకాలు, దిద్దులు, వంకీలు ఉన్నాయి. పదహారేళ్ళ పుట్టిన రోజుకి వడ్డాణం కూడా చేయించారు. అవన్నీ గుర్తు రావడంతో పెళ్ళికి ప్రత్యేకంగా బంగారం చేయించడం లేదన్న అసంతృప్తి ఆమెని బాధించలేదు.

మరునాడు పెద్ద కారులో శివతో పాటు ముగ్గురూ విజయవాడ ప్రయాణం అయ్యారు.

నాంచారమ్మ ఇంట్లో ఉండిపోయింది. ఆవిడకి మనవరాలి పెళ్లి దగ్గరకు వస్తోందన్న ఉత్సాహం చచ్చిపోయింది. ఏంటో పెళ్లి అనుకున్న దగ్గర నుంచీ ఇంట్లో ఏదో అశాంతి.

ముఖ్యంగా చాముండేశ్వరి కుటుంబం వెళ్ళిపోడంతో ఇంటి చుట్టు పక్కలే కాదు, ఊరు మొత్తం బోసిపోయినట్టు అనిపిస్తోంది నాంచారమ్మకి.

బంధువులు కాదు కానీ బంధువులకన్నా ఎక్కువగా కలిసిపోయారు. దాదాపు రెండేళ్ళు ఎలాంటి అరమరికలు లేకుండా,ఎంతో అభిమానంతో ఉండేవాళ్ళు. అలాంటిది అనవసరమైన విషయాల్లో రెండు కుటుంబాల మధ్యా స్పర్ధలు వచ్చి, దూరమైనా, వాళ్ళ మీద ముఖ్యంగా చాముండేశ్వరి మీద మమకారం మాత్రం పోలేదు నాంచారమ్మకి . కళకళలాడే ఆవిడ మొహం, నిత్యపూజలతో లక్ష్మీదేవి చుట్టుపక్కల తిరుగుతున్నట్టే ఉండేది.

ఆవిడకి మోహన్ మీద కోపం వచ్చింది. చదువు, సంధ్యా లేకుండా ప్రేమ, ప్రేమ అంటూ అర్హత లేని ప్రేమ వెంట పడి తమ మధ్య ఉన్న బంధాన్ని పాడు చేసాడు... తన భవిష్యత్తు పాడు చేసుకున్నాడు. ఒక విధంగా తన మనవరాలి జీవితం కూడా దెబ్బ తిన్నది. ఆ వెధవ వెంటపడుతున్నాడనేగా, లేకపోతే, చదువు మాన్పించడం ఏమిటి మాధవ పిచ్చి కాకపోతే అనుకుంది.

పిల్లలు ఒక వయసు వచ్చాక కొన్ని ఆకర్షణలకు, కొన్ని ప్రలోభాలకు లొంగిపోయి, క్రమశిక్షణ తప్పడం సహజం. అంతమాత్రాన కొంపలంటుకుపోయినట్టు ఇంతగా రభస ఎందుకు చేసుకున్నారు? ఈ విషయంలో మాధవది మాత్రమే తప్పు కాదు. తనదీ ఉంది. ఆరోజు చాముండేశ్వరి వచ్చి మోహన్ విషయం చెప్పగానే మహంకాళి లా విరుచుకుపడింది. కొంచెం పెద్దరికంతో ఆలోచించి ఉంటే ఇంత అనర్ధం జరిగెదా?

పరిస్థితులు తరుముకొస్తున్నట్టు శివ, పవిత్రల పెళ్లి నిశ్చయం అవడం కూడా ఆవిడకి అంతగా జీర్ణం కావడం లేదు. ఎన్నో అనుకుంది మనవరాలి పెళ్లి ఆవిడకున్న ఒక మధుర స్వప్నం.

నాంచారమ్మ అశాంతిగా అటూ, ఇటూ పొర్లింది. చాముండేశ్వరి కుటుంబం పవిత్ర పెళ్లి వేడుకలో లేకపోవడం చాలా పెద్ద లోటుగా అనిపిస్తోంది. గుడివాడ నిండా బోలెడు మంది బంధువులు, మిత్రులు ఉన్నా, వీళ్ళ దారి వీళ్ళదే.

ఎక్కడో కుక్కలు మొరుగుతుంటే తిట్టుకుంటూ కళ్ళు మూసుకుంది.

మాధవ డ్రైవ్ చేస్తున్నాడు. వర్ధని ఆయన పక్కన కూర్చుంది. శివ, పవిత్ర వెనక సీటులో కూర్చున్నారు. ఏదన్నా మాట్లాడాలంటే ఇద్దరికీ ఇబ్బందిగానే ఉంది. మిర్రర్ లో నుంచి తండ్రి తననె గమనిస్తున్నాడు అని భయంగా ఉంది పవిత్రకి. శివ కూడా ఆమెకి కొంచెం దగ్గరగా జరిగి కూర్చోవాలని ఉన్నా, ఇద్దరి మధ్యా ఎడం పాటిస్తూ కూర్చున్నాడు. సరదాగా చనువుగా కాకుండా చాలా మెకానికల్ గా ఉంది వాళ్ళ సంభాషణ. అవసరం అయితే తప్ప ఎవరూ మాట్లాడడం లేదు. శివకి మాధవ మీద పీకలదాకా కోపంగా ఉంది. తనూ, పవిత్రా మాత్రమే కలిసి వెళ్ళాలి అనుకున్నాడు. కానీ, ఆ

విషయానికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా నలుగురూ కలిసి వెళ్ళడం నచ్చలేదు. అసలే ఈ మధ్య పవిత్రని కలవడం చాలా కష్టంగా మారింది. ఇన్నాళ్లో లేని ఆంక్షలు చికాకు పెడుతున్నాయి.

మధ్యలో ఆగి బ్రేక్ ఫాస్ట్ చేసి, విజయవాడ చేరారు.

శివకి విజయవాడ వెళ్లి పవిత్రతో ఏకాంతంగా గడపాలన్న కోరికే కానీ, ఆమెకోసం ఇన్ని చీరలు కొనాలి, ఇన్ని నగలు కొనాలి అన్న ఆలోచన లేదు. అందుకే పవిత్ర ఈ చీర బాగుందా? ఈ కలర్ బాగుందా? ఈ నగ బాగుందా అని అడుగుతున్నా, నిరాసక్తంగా సమాధానాలిచ్చాడు.

పవిత్రకి అతని ధోరణి చిత్రంగా అనిపించింది. తండ్రి ఇంటి దగ్గర చెప్పినంత కచ్చితంగా లేదు ముఖ్యంగా పట్టు చీరల షాప్ లో వాళ్ళిద్దరినీ వదిలేసి, వర్ధని ని తీసుకుని మరో కౌంటర్ దగ్గర పెట్టుపోతలకి, నాంచారమ్మ కీ, వర్ధనికీ బట్టలు కొనడానికి వెళ్ళిపోయాడు. అప్పుడైనా శివ కొంచెం ప్రసన్నవదనంతో ప్రేమగా మాట్లాతాడని ఆశించిన పవిత్రకి నిరాశ ఎదురైంది. అప్పుడు కూడా ముభావంగానే ఉన్నాడు. పవిత్రే అంది “కోపం వచ్చిందా శివా? ఎందుకలా సీరియస్ గా ఉన్నావు?”

“నాకెందుకు కోపం? నిన్ను పీక్కు తినేవాడినో కొరుక్కు తినే వాడినో అన్నట్టు మీ అమ్మా, నాన్నా మనకి బాడీ గార్డుల్లాగా వచ్చారు కదా! చాలా సంతోషంగా ఉంది” అన్నాడు వెటకారంగా.

“నెలరోజులు ఓపిక పట్టు శివా నేను నీ దాన్నేగా” జాలిగా అంది పవిత్ర.

అతనేం మాట్లాడలేదు. ఆమె సెలెక్ట్ చేసుకున్న చీరల బిల్ చెల్లించి, అటూ, ఇటూ తిరుగుతూ అద్దాల్లో ఉన్న చీరలు చూస్తూ గడిపాడు. కొద్ది క్షణాల తరవాత పసుపు రంగుకి వంగపండు రంగు జరీ బోర్డర్ ఉన్న కంచిపట్టు చీర చూసి, ఆ కౌంటర్ దగ్గరకు వెళ్ళాడు. పవిత్ర అతన్ని అనుసరించింది.

“ఈ చీర మా పిన్నికి కొంటాను “ అన్నాడు.

“చాలా బాగుంది” అంది పవిత్ర.

అది ప్యాక్ చేయమని సేల్స్ బాయ్ కి చెప్పి, బిల్ కౌంటర్ దగ్గరకు వెళ్ళాడు.

ఆ చీర ఎంత బాగుందో ముందు చూసి ఉంటే నేనే కొనుక్కునేదాన్ని కదా అనుకుంది పవిత్ర.

చాలా పెద్ద బాగ్ లు గుమాస్తా తీసుకొచ్చి కారులో పెట్టాడు. శివ నేను డ్రైవ్ చేస్తాను అంటూ మాధవ చేతిలో స్టీరింగ్ తీసుకున్నాడు. వర్ధని పవిత్ర పక్కన వెనకాల సీటులో కూర్చుంది. మాధవ శివ పక్క సీట్లో కూర్చున్నాడు. పవిత్ర మనసు చివుక్కుమంది. కళ్ళల్లో నీళ్ళు బయటకు రాకుండా, విండో లోంచి రోడ్ల మీద పోతున్న వాహనాలు చూస్తూ కూర్చుంది.

“బంగారం కొట్టుకి వెళ్ళాలేమో!” అన్నాడు మాధవ అర్థోక్తిగా.

“మా పిన్ని కొంటుంది” ముక్తసరిగా అన్నాడు శివ.

పవిత్రకి దుఃఖం ఆపుకోడం కష్టం అయిపొయింది. నిశ్శబ్దంగా మనసులోనే ఏడుస్తూ ఉండిపోయింది. ఆకరికి అతను పెట్టాల్సిన నగలు కూడా తన ఇష్టంతో సంబంధం లేదనమాట అనుకుంది. వెళ్ళేటపుడు ఎలా వెళ్ళారో, అంతకన్నా యాంత్రికంగా తిరుగు ముఖం పట్టారు.

పవిత్ర పెళ్లి శివతో చాలా మామూలుగా  జరిగింది.

లక్షాధికారి మాధవశర్మ ఏకైక పుత్రిక పవిత్ర వివాహం గుడివాడ అంతా  పందిరి వేసి, ఊరందరినీ పిలిచి ఎంతో ఆడంబరంగా జరగాలన్న నాంచారమ్మ కోరిక తీరలేదు. . సినిమా స్టారు లాంటి తన మనవరాలికి హీరో లాంటి కుర్రాడిని వెతికి వెతికి తేవాలి అనుకుంది. ఆ అవసరం లేకుండానే మనవరాలే ఆరడుగుల అందగాడిని ప్రేమించింది. కలెక్టర్ కి ఇచ్చి చేయాలి అనుకుంది. డాక్టర్ దొరికాడు. డాక్టరీ చదువంటే మామూలు చదువా? కలెక్టర్ కన్నా తీసిపోలేదుగా పర్లేదు అనుకుంది. మొత్తం గుడివాడ చుట్టుపక్కల జనాలని పిలిచి, ఆకాశమంత పందిరి వేసి, బంగారు పీటల మీద కూర్చోబెట్టి పెళ్లి చేయాలి అనుకుంది. వెండి పీటలు తెచ్చాడు కొడుకు.

మాధవశర్మ ఇంట్లో పెళ్లి. పిలిచినవారూ, పిలవని వారు అందరూ వచ్చారు.  ఊరు, ఊరు కదలి వచ్చింది. తలా ఒక చేయి వేసారు.

శివ తరపు నుంచి అతని పిన్ని, బాబాయ్, వాళ్ళ పిల్లలు ఇద్దరు  అతని స్నేహితులు , తోటి డాక్టర్స్ నలుగురు వచ్చారు.

సాయంత్రానికి అప్పగింతలు కూడా అయిపోయాయి. అప్పటివరకు మనసులో ఏముందో భార్య కూడా గ్రహించలేనంత గంభీరంగా ఉన్న మాధవ భోరుమని ఏడ్చాడు. వర్ధని వెక్కి, వెక్కి ఏడ్చింది. నాంచారమ్మ కుమిలి కుమిలి ఏడ్చింది.

అప్పగింతల తరవాత శివ ఇంటికి వెళ్లి మరునాడు హైదరాబాద్ వెళ్లిపోతామని, తనకి హైదరాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్ లో పోస్టింగ్ వచ్చిందని పెళ్లి రెండు రోజులు ఉందనగా చెప్పాడు శివ. ఆ విషయం విన్న వెంటనే నిర్ఘాంతపోయాడు మాధవ్. ఉన్న ఊళ్ళో కళ్ళ ముందు ఉంటుందని అనుకున్నాడు ఇన్నాళ్ళూ. అకస్మాత్తుగా శివ అలా చెప్పగానే "అదేంటండి ఈ విషయం నాకు ముందు చెప్పలేదేం" అన్నాడు విస్మయంగా.

"బాగుంది. నేనేం కలగన్నానా ఇలా వస్తుందని. బహుశా మీ అమ్మాయి అదృష్టం అనుకుంటా నాకు మంచి అవకాశం వచ్చింది. అయినా హైదరాబాద్ అంటే అమెరికా కాదుగా" అన్నాడు శివ అదోలా నవ్వుతూ.

పవిత్ర అతని నవ్వు, అతని మాటలు విచిత్రంగా చూస్తూ ఉండిపోయింది. నాన్నతో ఇలా మాట్లాడ తాడేంటి? నాన్న అంటే గౌరవం లేదా? లేక పెళ్ళికి ముందు ఆంక్షలు పెట్టాడన్న కోపమా? గత నెల రోజులుగా చూస్తున్న శివ తనకి తెలిసిన శివ కాదు. ఇతని తత్వమే ఇంతా! లేక కోపం, బాధ లాంటివి ఉన్నాయా?  పవిత్రకి తండ్రి మీద ప్రేమ పొంగుకొచ్చింది.

వెళ్లి ఆయన పక్కన కూర్చుంది. శివ ఆమె వైపు చూసాడు. ఆ చూపులో ఇదివరకటి మృదుత్వం, అనురాగం లాంటివి కనిపించలేదు. తండ్రి చేయి గట్టిగా పట్టుకుంది.

ఇప్పుడు ఆ ఇంటి పెద్దలు ముగ్గురూ పవిత్ర హైదరాబాద్ వెళ్ళిపోతుంది అన్న సత్యాన్ని జీర్ణం చేసుకోలేకపోతున్నారు.

పెళ్ళిలో చేస్తున్న ప్రతి తంతుకీ మాధవ అంతరాత్మ ఎదురుతిరుగుతూనే ఉంది. తప్పుచేసానా? ఈ సంబంధం ఒప్పుకోకుండా ఉండాల్సిందా? చిన్నపిల్ల అది తెలిసీ తెలియక ఏదో ఆకర్షణ లో పడి అతన్నే పెళ్లి చేసుకుంటాను అంటే ఒద్దు అని గట్టిగా ఎందుకు చెప్పలేకపోయాను? అని క్షణం, క్షణం పశ్చాత్తాపంతో దహించుకుపోసాగాడు. తిరిగి తనకి తానే సర్ది చెప్పుకుంటూ కుర్రాడు అందగాడు, చదువుకున్నవాడు, ఏదో చిన్నతనం కొద్దీ తను పెట్టిన ఆంక్షల వలన కోపంగా ఉన్నాడు సర్దుకుంటాడు. నా కూతురుని ప్రేమగా చూసుకుంటాడు అనుకోసాగాడు.

ఆ ఇంటి మహాలక్ష్మి పవిత్ర మెడలో పసుపుతాడు, మెడను చుట్టుకున్న నల్లపూసలు, మెట్టెలు, మధుపర్కాలు, పూలజడ, నుదుటి నిండా కళ్యాణ తిలకాన్ని కప్పేసిన కుంకుమ, కళ్ళ నిండా కాటుక, బుగ్గన చుక్క తో అపరంజి బొమ్మలా వచ్చి పాదాలకు నమస్కారం చేస్తుంటే, గట్టిగా హృదయానికి హత్తుకుని, “నన్ను క్షమించు తల్లీ. నీ సుఖం, మన కుటుంబం పరువు కోసం కఠినంగా ఉన్నాను.” అనుకున్నాడు మనసులో.

వర్ధని కూడా దగ్గరకు తీసుకుని దీవిస్తూ “జాగ్రత్తమ్మా” అంది రుద్ధమైన స్వరంతో.

నాంచారమ్మ ఏడుస్తూ “నీకెప్పుడు రావాలనిపిస్తే అప్పుడు రా కన్నా... పెళ్లి అయిందని పరాయిదాన్ని అనుకోకు. ఈ ఇల్లు నీది... నీకు సర్వహక్కులూ ఉన్నాయి” అంది.

అందరి దగ్గరా కన్నీళ్ళతో సెలవు తీసుకుని వెళ్లి, శివ పక్కన కారులో కూర్చుంటుంటే వాళ్ళ దుఃఖం ఆపడం ఎవరి తరం కాలేదు.

శివ పిన్ని సరళ నచ్చ చెబుతూ అంది వర్దనితో. “వదినగారూ! మనం అందరం ఇలా వచ్చిన వాళ్ళమే కదా పుట్టింటిని, కన్నవారిని వదిలి. మీరిలా బాధపడితే ఎలా? ఎప్పుడంటే అప్పుడు మీరు రావచ్చు, అమ్మాయిని పంపమన్నా పంపిస్తాం. బాధపడకండి. మీ అమ్మాయిని పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటాం”.

వర్ధని తల ఊపింది. నాంచారమ్మ మాత్రం ఆవిడ చేతులు పట్టుకుని “కంటి రెప్పలా చూసుకున్నాం తల్లీ. నా తల్లిని జాగ్రత్తగా చూసుకోండి” అంది.

“తప్పకుండా. మీరే చూస్తారుగా మీ మనవరాలు ఎంత సంతోషంగా ఉందో. తను కాపురం పెట్టగానే మీరు రండి నాలుగురోజులు ఉండి వెళ్ళండి” అంది ఆవిడ.

శివ బాబాయి చాలా తక్కువ మాట్లాడతాడు. ఆయన మాధవని ఓదారుస్తూ “మీ అమ్మాయి ఇక నుంచీ మా అమ్మాయి. సరేనా?” అన్నాడు.

శివ అందరికీ నమస్కరించాడు. కారు కదిలింది. కారులో శివ, పవిత్ర ఉన్నారు. డ్రైవర్ ఉన్నాడు. మరో కారులో సరళ, ఆమె భర్త, సరళ అక్క పిల్లలు.

కళ్యాణ మంటపం ఖాళీ అయింది. బరువెక్కిన హృదయాలతో సామాను సర్దుకోడానికి లోపలికి వెళ్ళారు వర్ధని, నాంచారమ్మ.

పవిత్రని కాపురానికి పంపడానికి వాళ్ళతో పవిత్ర తరపున వర్ధని పెద్దమ్మ కూతురు వకుళ కూతురు వెళ్ళింది. వాళ్ళు విజయనగరం లో ఉంటారు. ఆ అమ్మాయి పేరు సీత. ఇంకా పెళ్లి కాలేదు. డిగ్రీ చదువుతోంది. పెద్దగా రెండు కుటుంబాల మధ్యా రాకపోకలు లేకపోడంతో సీతకీ, పవిత్రకీ మధ్య కూడా అంత చనువు లేదు. కారులో శివ, పవిత్రలతో పాటు సీత కూడా వెళ్తుంటే, తమ తరపు నుంచి ఒక వ్యక్తి వెళ్తుందన్న నిశ్చింత కలిగి ఊపిరి పీల్చుకుంది వర్ధని.

పవిత్ర జీవితంలో రెండో అధ్యాయం మొదలైంది. హైదరాబాద్ లోని అమీర్ పేట దగ్గర ఒక రెసిడెన్షియల్ కాలనీ లో రెండు పడకగదుల ఇంట్లో ఆమె కాపురం మొదలైంది.

సరళ, సీతల సారధ్యంలో వాళ్ళ మొదటిరాత్రి సరదాగా మొదలై, పవిత్ర జీవితంలో మధురమైన రాత్రిగా నిలిచిపోయింది.

జరీ అంచు ఉన్న తెల్లని వేంకటగిరి చీరలో, తల నిండా మల్లెలతో గదిలో అడుగుపెట్టిన పవిత్రని అమాంతం ఎత్తుకుని గిరగిర తిప్పేసి “ఎంత బాధపెట్టావో తెలుసా నన్ను” అన్నాడు గోముగా.

పవిత్ర నవ్వింది మధురంగా. “కొన్ని బాధలు తీయగా ఉంటాయి” అంది.

“ఓ నీకు రకరకాల బాధల గురించి తెలుసనమాట. సరే, అవన్నీ తీరుబడిగా వింటాను. ఇప్పుడు అసలు, సిసలైన తీయని బాధ రుచి చూపించనా?” అంటూ ఆమెని గట్టిగా కౌగిట్లో బంధించి నలిపెయసాగాడు..

“అబ్బా” తీయగా మూలిగింది పవిత్ర.

“ఈ అనుభవం కోసం ఒక జీవితకాల నిరీక్షణగా అయింది నా పరిస్థితి. అందుకు నీకు శిక్ష వేయాలి. నువ్వు అబ్బా, అన్నా, అమ్మా అన్నా వదిలేది లేదు” అంటూ పెదవులతో ఆమె శరీరం మీద ముద్రలు వేస్తూ ఉండగా వెన్నెలరేడు మెల్లగా తప్పుకున్నాడు.

మరునాడు సీత వెళ్ళిపోయింది. సరళ ఆమెకి శాస్త్రోక్తంగా చీర, జాకెట్టు, పసుపు, కుంకుమా ఇప్పించింది పవిత్రతో.

సీత వెళ్ళిపోగానే పవిత్రకి దిగులు ముంచుకొచ్చింది. అపరిచితమైన పరిసరాలు, అంతగా చనువులేని సరళా, ఆమె భర్త... బిడియంగా అనిపించింది.

శివ అనురాగ జలధిలో ఆమెని ముంచెత్తుతొంటే ఆ దిగులు, బిడియం క్రమంగా మాయమై, మనసు, శరీరం శివ మయం అయిపోయింది.

వారం రోజులు గడిచాయి. సరళా, ఆమె భర్త విశ్వప్రసాద్ వెళ్ళిపోయారు.

ఆవిడ ఉన్న ఆ వారం రోజులు పవిత్రని ఎంతో బాగా చూసుకుంది. ఆమెకి ఏమిష్టమో అడిగి, తనే వంట చేసింది. సాయంత్రాలు అవగానే పవిత్రని అందంగా అలంకరించి, ఆమె నగలు ఒక్కోటి తీసి చూసి, ఒక్కో రోజు ఒక్కో నగ చొప్పున వేసింది. మల్లెపూలు మాల కట్టి స్వయంగా పవిత్ర జడలో పెడుతూ, 'నీ జడతో మా వాడిని బంధించేయకు సుమా!' అని కొంటెగా నవ్వింది.

రోజూ సాయంత్రం ట్యాంక్ బండ్ కో, పబ్లిక్ గార్డెన్ కో తీసుకుని వెళ్లి, బోలెడు కబుర్లు చెబుతూ, రోజుకో రకం ఐస్ క్రీం తినిపించి, జీవితం ఇంత మధురంగా ఉంటుంది అని అనిపించేలా శివ ఆమెని అపురూపంగా చూసుకున్నాడు.

డాక్టర్ విశ్వప్రసాద్ మాత్రం ఉదయం హాస్పిటల్ కి అక్కడి నుంచే వెళ్లి, రాత్రి పొద్దుపోయాక వచ్చేవాడు. ఈలోగా సరళా, శివా పవిత్రతో కబుర్లు చెబుతూ, ఆమె గురించిన విషయాలు తరచి తరచి అడిగి తెలుసుకుంటూ, ఆమెని క్షణం కూడా ఒంటరిగా వదలకుండా కనిపెట్టి ఉన్నారు.

సరళ దంపతులు వెళ్తుంటే పవిత్ర కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

సరళ ఆమె కన్నీళ్లు తుడిచి, "నేను ఉండేది ఈ ఊళ్లోనే. బి.హెచ్ ఇ ఎల్ లో. నీకు నన్ను చూడాలి అనిపించగానే మా శివకి చెప్పు, రెక్కల గుర్రం మీద తీసుకుని వస్తాడు. లేదంటే నేనే వచ్చేస్తాను సరేనా?" అంది.

కన్నీళ్ళ మధ్య నవ్వింది పవిత్ర.

సరళ వాళ్ళు వెళ్ళిన మరునాడు "నేను డ్యూటీ లో ఇవాళ జాయిన్ అవాలి. నువ్వు ఒక్కదానివే ఉండాలి. భయమేం లేదు. పనమ్మాయికి చెప్పాను. అందరిళ్ళల్లో పని అవగానే నీ దగ్గరకు వస్తుంది. నేను త్వరగా వచ్చేస్తాను. సరేనా?" అన్నాడు. శివ ఆమెని ముద్దుపెట్టుకుంటూ.

అతని కౌగిట్లో ఒదిగిపోతూ "అమ్మా,నాన్నలతో మాట్లాడాలని ఉంది. మన ఇంట్లో ఫోన్ లేదా?" అనడిగింది.

అతని మొహంలో క్షణం సేపు రంగులు మారాయి. వెంటనే నవ్వి, "ఇప్పుడేగా వచ్చాం. ఫోన్ కి అప్లై చేస్తాలే. అయినా అప్పుడే మీ అమ్మానాన్నల మీద బెంగ పెట్టేసుకున్నావా?" అన్నాడు.

"నేనెప్పుడూ అమ్మానాన్నలని వదిలి ఉండలేదు" అంది కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే.

"ఇంతకు ముందు పెళ్లి చేసుకోలేదుగా " తన జోక్ కి తనే గట్టిగా నవ్వి అన్నాడు.

"ఛీ ఏంటా మాటలు?" అతని పెదవి మీద కుడిచేయి చిటికెన వేలితో సున్నితంగా కొట్టింది.

"ఇలా కాదు. నీకసలు సరసం తెలియదు. ఇలా చెప్పాలి " అంటూ పెదాలతో ఆమె పెదవులు బంధించేసాడు.

"వదులు శివా! తలుపులు తీసి ఉన్నాయి." బలవంతంగా విడిపించుకుంది.

"శివా కాదు. భర్తని పేరు పెట్టి పిలవడం మన సంప్రదాయం కాదు." అన్నాడు. అలా అంటున్నప్పుడు అతని స్వరంలో ధ్వనించిన ఆజ్ఞ కి విచిత్రంగా చూసింది.

"ఎప్పుడూ ఇలాగే పిలుస్తానుగా" అంది.

"ఇక నుంచీ పిలవకు. ఏమండి అను" ఆమెని వదిలి షర్టు సరిచేసుకుని కోటు తొడుక్కుంటూ ఉంటె, కొత్త రూపం తొడుక్కుంటున్నట్టు, అతన్నే చూస్తూ..."అ..లా...గే" అంది.

అతను షూస్ వేసుకుని, "ఒకే బై. తలుపేసుకో" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన వైపు తెల్లబోయి చూస్తూ నిలబడిపోయింది పవిత్ర.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS